సాక్షి
మెదక్

బుధవారం । 29 । నవంబర్ । 2023



గుబాళించిన గజ్వేల్
సీఎం కేసీఆర్ తన చిట్టచివరి ఎన్నికల ప్రచార సభను తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో నిర్వహించడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉపొంగింది. వివరాలు 2లో ▸



ఆదరించి గెలిపించండి
ఆడబిడ్డగా ఆదరించి గెలిపించాలని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ప్రజలను కోరారు. వివరాలు 3లో ▸



జోరుగా బీఆర్ఎస్ ప్రచారం
బూటకపు హామీలతో దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మళ్లీ ప్రజలను మోసగించడానికి యత్నిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక ఆరోపించారు. వివరాలు 3లో ▸

న్యూస్‌రీల్

మోడల్ పోలింగ్ కేంద్రం సిద్ధం
ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి మంగళవారం పరిశీలించారు. కేంద్రం వద్ద చేస్తున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించి తగిన సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అధికారులతో పాటు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలింగ్ కేంద్రం ఇన్‌చార్జి ప్రణయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, బీఎల్‌ఓలు ఫరీద, కమల, సుమిత్ర, నిర్మల, కారోబార్ ఎల్లం పాల్గొన్నారు.

మీడియా సెంటర్ పరిశీలన



మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మెదక్ కలెక్టరేట్: మెదక్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జిల్లా సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్, వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద గల సీసీ కెమెరాల రికార్డింగ్ పనితీరును తనిఖీచేశారు. అలాగే సీ విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలు ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీమ్ పనితీరు, మీడియాలో వచ్చే వార్తలు, పెయిడ్ న్యూస్, పత్రికా ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా రికార్డింగ్ పనితీరును తెలుసుకున్నారు. వారి వెంట జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

పోలింగ్‌బూత్ లేదు..
చిలప్‌చెడ్(నర్సాపూర్): టోప్యాతండాలో సుమారు 400 ఓటర్లు ఉన్నారు. పంచాయతీగా ఏర్పాటై ఐదేళ్లు గడుస్తోంది. అయినప్పటికీ అధికారులు ఆ తండాలో పోలింగ్‌బూత్ ఏర్పాటు చేయలేదు. దీంతో తండా వాసులు ఓట్లు వేయాలంటే పక్కన ఉన్న గౌతాపూర్ గ్రామానికి వెళ్లాలి. చిలప్‌చెడ్ మండలం టోప్యాతండా వాసులు గురువారం జరిగే ఎన్నికల్లో ఓట్లు వేయబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ తండాలో పోలింగ్‌బూత్ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. సరిపడా ఓటర్లు ఉ న్నా పోలింగ్‌బూత్ ఏర్పాటు చెయ్యకపోవడం ఎంత వరకు సమంజసమని వాపోయారు. తహశీల్దార్ ముసాద్దీక్‌ను వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కంచడానికి ప్రయత్నిస్తానని చెప్పారు.

మూగ బోయిన మైకులు

- ఎన్నికల ప్రచారానికి నేటితో ముగింపు
- ప్రలోభాలకు తెరలేపిన నాయకులు
- మద్యం, డబ్బుల పంపిణీతో ఓటర్లకు గాలం



మెదక్: నెలన్నరగా ఎన్నికల ప్రచారంతో పల్లెలు, పట్టణాలు, జిల్లా కేంద్రాలు మార్మోగాయి. అక్టోబర్ 9న, ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో ఆయా పార్టీలకు చెందిన నాయకులు తమ అభ్యర్థినే గెలిపించాలని అగ్రనేతలు వచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. మెదక్, నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థులు పద్మాదేవేందర్‌రెడ్డి, సునితాలక్ష్మారెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రచారం చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌కు మద్దతుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యరావు ఠాక్రే, మెదక్ మాజీ ఎంపీ సీనియర్ నేత విజయశాంతి మద్దతుగా ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్‌కు మద్దతుగా ఈటల రాజేందర్, అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ, ప్రధాన మంత్రి మోదీ లాంటి అగ్రనేతలు తమ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీగా గెలిపించాలని ఓటరు దేవుళ్లను వేడుకున్నారు. ఎన్నికల బరిలో నిలుచున్న అభ్యర్థుల కుటుంబ సభ్యులు సైతం ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు.

ప్రలోభాలు ప్రారంభం..

ఎన్నికల ప్రచారానికి తెర పడడంతో రాజకీయ పార్టీలన్నీ ప్రలోభాలకు తెర లేపాయి. మూడు, నాలుగు రోజులుగా గ్రామాలలో మద్యం ఏరులై పారుతోంది. ఇప్పటికే అన్ని పార్టీల నాయకులు మద్యం, బాటిళ్లను డంప్‌చేసి ఓటర్లకు చేరవేశాని సమాచారం. ఇంటింటికీ మందుతో పాటు డబ్బులను పంపిణీ చేయడానికీ నేతలు సిద్ధమయ్యారు. మంగళవారం రాత్రి నుంచే పంపిణీ కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని ఆయా పార్టీల నేతలు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రలోభాల ద్వారా ఓట్లను దండుకునేందుకు అన్ని పార్టీలు ఒకరికి మించి ఒకరు వ్యూహాలను రచిస్తున్నారు. పోలీసులకు చిక్కకుండా మద్యం బాటిళ్లు, డబ్బును అన్ని మండలాలు, గ్రామాలకు తరలించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా జిల్లాలోని మద్యం దుకాణాలలో మద్యం దొరకడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు సర్వ శక్తులు ఒడ్డుతున్నారు.

144 సెక్షన్ అమలు

ఎన్నికల ప్రచారం ముగియడంతో జిల్లాలో 144 సెక్షన్ అమలులోకి తెచ్చారు. అది 48 గంటల పాటు అమలులో ఉంటుంది. డబ్బు , మద్యం పంపిణీతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ప్రచారం చేసినా, మైకులు వాడినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా స్పష్టం చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి పోలీసు బలగాలను దించారు.

మైక్రో అబ్జర్వర్‌లు కీలకం

జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లు కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. గురువారం జరగబోయే ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కలెక్టరెట్‌లో మైక్రో అబ్జర్వర్లకు రెండోసారి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో మైక్రో అబ్జర్వర్లు కీలకమని, వారంతా పోలింగ్ రోజు కేంద్రాల్లో ర్యాంప్‌లు, తాగునీటి వసతి, విద్యుత్, టాయిలెట్స్ వంటి సదుపాయాలు, పోలింగ్ నిర్వహణ, ఈవీఎం, వీవీ ప్యాట్‌లు, పోలింగ్ ఏజెంట్‌ల నియామకం, ఇంక్ బాటిల్స్, ఎన్నికల నిర్వహణ జాగ్రతగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. మాక్ పోలింగ్, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సంఘటనలకు చోటు లేకుండా చూడాలని ఆదేశించారు. ఎన్నికలకు ముందు ఎన్నికల అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తూప్రాన్ ఆర్డీఓ జయచంద్ర, మైక్రో అబ్జర్వర్స్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు..

ఎన్నికలలో భాగంగా సోమవారం అర్ధరాత్రి జిల్లాలోని వివిధ గ్రామాలలో జిల్లా వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాపన్నపేట మండలం నార్సింగి చెక్‌పోస్టుతో పాటు మండలంలోని మిన్‌పూర్, కుర్తివాడ గ్రామాలను సందర్శించారు. అలాగే కొల్చారం మండలం రాంపూర్ చెక్‌పోస్ట్‌తో పాటు పాతంశెట్టిపల్లి, అప్పాజీపల్లి గ్రామాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టుల వివరాలు, చెక్‌పోస్ట్‌లో రికార్డులను, సీసీ కెమెరాల రికార్డ్స్ పరిశీలించారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కృష్ణమూర్తి, ఎన్నికల సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపిస్తే 5 వేల ఇళ్లు



రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

- డిగ్రీకళాశాల, మినీ స్టేడియం ఏర్పాటు
- రోడ్‌షోలో మంత్రి హరీశ్‌రావు

చేగుంట(తూప్రాన్): బీఆర్ఎస్‌ను గెలిపిస్తే చేగుంట మండలానికి 5 వేల డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తానని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. చేగుంటలో మంగళవారం దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గంను ఎంతో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఉప ఎన్నికల్లో మాయమాటలను నమ్మి బీజేపీ అభ్యర్థిని గెలిపించడంతో అభివృద్ధి జరగలేదని, మూడేళ్లలో రఘునందన్‌రావు ఏమీ చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మాటలకు మోసపోకుండా బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని మంత్రి హరీశ్‌రావు కోరారు. చేగుంటలో డిగ్రీ కళాశాల, మినీ స్టేడియం, ప్రభుత్వ ఆస్పత్రి విస్తరణకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై జరిగిన కత్తి దాడిపై కొందరు నాయకులు ఎద్దేవా చేయడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామాల్లోనే ఉంటూ అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మాసుల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, నాయకులు రాజిరెడ్డి, నారాయణరెడ్డి, వేణుగోపాలశర్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

గౌడ కులస్తుల అండ అవసరం

ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మదన్ రెడ్డి

నర్సాపూర్ రూరల్: గౌడ కులస్తులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికే వారంతా అండగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్ గౌడ కులస్తులను కోరారు. మంగళవారం గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డికి మద్దతుగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కల్లు దుకాణాలకు సంబంధించి రూ.20 కోట్ల రెంటల్స్ మాఫీ చేసిందని, కల్లుగీత కార్మికుల కోసం రూ.5 లక్షల గీతబీమా తీసుకొచ్చామని గుర్తుచేశారు. మద్యం దుకాణాల ఏర్పాటుకు పదిహేను శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. రూ.5 కోట్లతో ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. గౌడ కులస్తులను అన్ని రకాలుగా ఆదుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండి మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్ లింగం గౌడ్, జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ చందా గౌడ్, సింగయ్యపల్లి గోపి, సత్యం గౌడ్, ఆంజనేయులు గౌడ్, నాగరాజు గౌడ్, మద్దూర్ అశోక్‌గౌడ్, రవి గౌడ్, రాకేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీయాదవ్

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్

నర్సాపూర్: ఎన్నికలప్పుడు బీఆర్ఎస్ ఇచ్చిన హామీల అమలులో విఫలం చెందిందని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీయాదవ్ ఆరోపించారు. మంగళవారం ఆయన కర్ణాటక ఎంపీ, మాజీ మంత్రి, ఇతర నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధనిక రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా తయారు చేశారని ఆరోపించారు. గడీల పాలన కొనసాగుతుందని, బడుగు, బలహీన వర్గాలకు బీఆర్ఎస్‌లో చోటు లేదని వాపోయారు. అధికార పార్టీ డబ్బు, మద్యంతో ఎన్నికలలో గెలిచేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో కర్ణాటకకు చెందిన ఎంపీ డాక్టర్ ఉమేశ్‌జాదవ్, మాజీ మంత్రి మాణిక్య గుత్తెదార్ గౌడ, పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఈశ్వర్‌సింగ్ ఠాగూర్, ఎంఆర్‌పీఎస్ నాయకుడు యాదగిరి, స్థానిక బీజేపీ నాయకులు సురేశ్, రమేశ్‌గౌడ్, రాజేందర్, రమణ, యాదగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

మెదక్ రీజియన్ మేనేజర్ ప్రభులత

సంగారెడ్డి టౌన్: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆర్టీసీ మెదక్ రీజియన్ మేనేజర్ ప్రభులత అన్నారు. మంగళవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించారు. నారాయణఖేడ్ నుంచి బషీర్ మాట్లాడుతూ నారాయణఖేడ్ కార్గో పార్సిల్ బుక్ చేస్తే ఆలస్యంగా వస్తోందని త్వరగా వచ్చేలా చూడాలన్నారు. కంది నుంచి జైపాల్ మాట్లాడుతూ చర్యలు జల్కల్ స్కూల్ బస్సును రెగ్యులర్‌గా నడపాలన్నారు. సంగారెడ్డి నుంచి నరేశ్ మాట్లాడుతూ శబరిమలైకి ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. గడిపెద్దాపూర్ నుంచి ప్రభాకర్ మాట్లాడుతూ మెదక్ నుంచి పెద్దశంకరంపేట, గడిపెద్దాపూర్ మీదుగా సర్వీస్ నడపాలి విజ్ఞప్తి చేశారు. మల్లికార్జున్ పల్లి నుంచి మనోహర్ మాట్లాడుతూ సదాశివపేట నుంచి మల్లికార్జునపల్లి వయా మునిపల్లి మీదుగా బస్సులు నడపాలన్నారు. సిర్గాపూర్ నుంచి అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ నారాయణఖేడ్ నుంచి పిట్లం వరకు బస్సులు నడపాలని కోరారు. ప్రజల సమస్యలు, సూచనలను విన్న ఆర్‌యం త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఎన్నికల కిక్కు

- రూ.51.68 కోట్ల మద్యం ఖాళీ
- 3 రోజుల ముందే దుకాణాల మూత

కొల్చారం(నర్సాపూర్): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, అభ్యర్థుల నామినేషన్, ఎన్నికల ప్రచారంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ఎన్నికలకు ఒక్కరోజు మాత్రమే సమయం ఉండడంతో పార్టీలన్నీ మద్యాన్ని పెద్ద ఎత్తున పంచేందుకు సిద్ధమయ్యాయి. ఎన్నికలకు మూడు రోజుల ముందే దుకాణాల్లో మద్యం ఖాళీ అయింది. 15 నుంచి 28 వరకు (సెలవు దినాలు పోను) మండల పరిధిలోని చిన్నఘణాపూర్ ఐఎంఎల్ డీపో పరిధిలోని 118 మద్యం దుకాణాలు, 15 బార్లలో రూ.51,68,36,636 విలువగల మద్యం అమ్మకాలు జరిగాయి.వాటిలో ఇండియన్ మేడ్ లిక్కర్(ఐఎంఎల్) 57,831 కేసులు అమ్ముడుపోగా, బీరు 52,012 కేసులు అమ్ముడు పోయాయి. మొత్తంగా 1,09,843 కేసులు అమ్మకాలు జరిగాయి.

చార్మినార్ జోన్‌లోకి మెదక్‌జిల్లా..

మరింత మెరుగైన విద్య, ఆరోగ్యం
- మేనిఫెస్టో అమలుకు కృషి

నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి



నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడి

నర్సాపూర్: ఈ ఎన్నికలలో గెలిచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి చార్మినార్ జోన్‌లో కలుపుతామని, ఐటీ హబ్ ఏర్పాటు చేస్తామని నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి వాకిటి సునీతారెడ్డి హామీ ఇచ్చారు. తాము ప్రచారంలో భాగంగా ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు తమకు అండగా ఉంటామని, పూర్తి మద్దతు తెలుపుతున్నారని ఆమె చెపుతున్నారు. మరింత మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె అంటున్నారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో మాట్లాడారు.

ప్రచారం ఎలా సాగుతోంది? ప్రజల నుంచి స్పందన ఏమిటి?

ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు ఆయా మండలాల నాయకులు, గ్రామ నాయకులతో కలిసి గ్రామాల్లో ప్రచారం కోసం వెళితే ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పడుతున్నారు. నాకు అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో పాటు నాకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు.

ప్రజలు ఏయే సమస్యలను చెబుతున్నారు?

చాలా గ్రామాల్లో పేదలు సొంత ఇళ్లు కావాలని అడిగారు. ఇప్పటికే మూడు వేలగృహలక్ష్మి ఇళ్లు మంజూరు అయ్యాయి. ఇటీవల సీఎం కేసీఆర్ నర్సాపూర్‌కు వచ్చినప్పుడు నియోజకవర్గానికి మరో ఐదు వేల ఇళ్లు కావాలని విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఎన్నికల అనంతరం పేదలందరికీ గృహలక్ష్మి ఇళ్లు మంజూరు చేస్తాం.

పార్టీ మేనిఫెస్టోపై ప్రజల స్పందన ఎలా ఉంది?

సీఎం కేసీఆర్ రూపొందించిన మేనిఫెస్టోను ప్రజలు బాగా స్వాగతిస్తున్నారు. అన్ని పథకాలకు స్పందన బాగుంది. సౌభాగ్యలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.3 వేలు, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ, రైతుబంధు, రూ.4 వందలకే గ్యాస్ సిలిండర్, అసైన్డ్ భూములకు, పోడు భూములకు పట్టాలు అందజేసి సర్వ హక్కులు కల్పించే పథకాలతో పాటు ఇతర పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారు.

మీ విజయానికి ఏయే అంశాలు దోహదపడతాయని భావిస్తున్నారు?

సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు నియోజకవర్గంలోని అర్హులందరికీ అందాయి. లబ్ధిదారులంతా తమ పార్టీకి అండగా నిలిచారు. కొన్ని పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా ఉన్నాయి. ఆసరా పింఛన్లు, రైతుబంధు, మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికీ నల్లాల ద్వారా నీరు అందించాం. దీంతో తాగునీటి ఇబ్బందులు తొలిగిపోవడంతో మహిళల అండ మాకుంది. అలాగే ఆరోగ్య శ్రీ పథకం లాంటి పథకాలు నా విజయానికి దోహదపడతాయి. ఆ పథకాలే రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తెగలవు.

మీకు ఏ పార్టీతో గట్టి పోటీ ఉంది?

మాకు కాంగ్రెస్‌తోనే గట్టి పోటీ ఉంది. అయితే ప్రజల ఆశీర్వాదం, మా పార్టీ నాయకులు, కార్యకర్తల కృషితో నేనే తప్పక గెలుస్తాను. అసైన్డ్ భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకుంటుందని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆ కుట్రలను ప్రజలు గుర్తించి ఆ తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొడుతున్నారు. తమ ప్రభుత్వం ఇచ్చేదే తప్ప తీసుకునేది కాదని వారికి తెలుసు.

ప్రజలకు మీరిచ్చే హామీలు?

నేను గెలువగానే సీఎం కేసీఆర్, మంత్రులు సహకారంతో జిల్లాను సిరిసిల్లజోన్ నుంచి చార్మినార్ జోన్‌లో కలుపుతా. అలాగే నియోజకవర్గంలో ఐటీ హబ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాను. నర్సాపూర్‌లోని ఉస్మానియా పీజీ కాలేజీకి, ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తాం. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలు పూర్తి చేయడానికి, మైనారిటీ, బాలికల గురుకులాలకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాను. ప్రభుత్వ ఆసుపత్రులలో మరింత మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తాను. గ్రామాలలో అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్యత ప్రకారం ప్రణాళికబద్ధంగా చేపడతాం. పర్యాటకంగా కూడా అభివృద్ధి చేస్తాం.

బ్రహ్మారథం పడుతున్న ప్రజలు

చార్‌మినార్ జోన్‌కు జిల్లా మార్పు
- పేదల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే..
- ఆరు గ్యారంటీలు అమలు
- నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి



నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్: ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు తమకు బ్రహ్మరథం పడుతున్నారని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత, తమ పార్టీ నాయకులు, కార్యకర్తల కృషితో తాను గెలుస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తమ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను ప్రజలు బాగా ఆదరిస్తున్నారని చెప్పారు. మెరుగైన విద్య, వైద్యం అందుబాటులోకి తెచ్చి పేదలకు సేవ చేస్తానని, జిల్లాను చార్మినార్ జోన్‌లో కలిపేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన సాక్షితో మాట్లాడారు.

ప్రచారం ఎలా సాగుతోంది? ప్రజల నుంచి స్పందన ఏమిటి?

నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు మాకు బ్రహ్మరథం పట్టి ఆదరిస్తున్నారు.

మీకు ఎవరితో పోటీ ఉంటుంది?

తమ పార్టీకి బీఆర్ఎస్‌తోనే గట్టి పోటీ ఉంది. కాని నేనే గెలుస్తాను.

మీ విజయానికి ఏయే అంశాలు దోహదపడగలవని భావిస్తున్నారు?

నియోజకవర్గ ప్రజలలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది. పదేళ్లలో ప్రజలకు ఆశించిన స్థాయిలో ప్రభుత్వ పథకాలు అందలేదు. నియోజకవర్గంలో ఏ రంగంలోనూ చెప్పుకోతగ్గ అభివృద్ధి జరగలేదు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలలో విశ్వాసం కోల్పోయి వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ప్రజలలో ఉన్న వ్యతిరేకత, మా పార్టీ మేనిఫెస్టో నా విజయానికి దోహదం చేస్తాయి.

మీ మేనిఫెస్టోకు ప్రజల ఆదరణ ఎలా ఉంది?

ఆరు గ్యారంటీలతో కూడిన తమ మేనిఫెస్టోను ప్రజలు బాగా ఆదరిస్తున్నారు. ఆరు గ్యారంటీలలో మహిళలకు నెలకు రూ.2500, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, చేయూత పెన్షన్ నెలకు రూ.4 వేలతో పాటు ఇతర పథకాలు చిత్తశుద్ధితో అమలుచేసి అర్హులందరికీ అందేలా కృషి చేస్తాను. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా అమలుచేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలపై ప్రజలకు నమ్మకం ఉంది. పేద ప్రజల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు.

ప్రచారానికి వెళ్లినప్పుడు ప్రజల సమస్యలను గుర్తించారా?

నియోజకవర్గం రాష్ట్ర రాజధానికి దగ్గరగా, అభివృద్ధికి దూరంగా ఉండడం దురదృష్టకరం. గ్రామాలలో చాలా సమస్యలు తిష్ఠ వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాలకు, గిరిజన తండాల రోడ్లు అధ్వానంగా ఉండడంతో రవాణా సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండడాన్ని గుర్తించాను. మురుగు కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్య, వైద్య రంగాలను పట్టించుకునే నాథుడు లేక వెనుకపడ్డాయి. నర్సాపూర్ ఆసుపత్రిలో వైద్యులు లేక ప్రజలకు వైద్యం అందడం లేదు. ఇంకా చాలా సమస్యలు ఉన్నాయి.

ప్రజలకు మీరు ఏయే హామీలు ఇస్తారు?

తనను గెలిపిస్తే నాయకుడిగా కాకుండా, అందరికీ అందుబాటులో ఉండి ప్రజాసేవ చేస్తాను. నేను గెలువడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది. మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి చార్మినార్ జోన్‌లో కలిపేందుకు కృషి చేస్తాను. నర్సాపూర్‌లో ఉస్మానియా పీజీ కాలేజీకి సొంత భవనాలు నిర్మించడంతో పాటు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు, మిని స్టేడియం నిర్మాణానికి కృషిచేస్తాను. అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేయిస్తా. గ్రామాలలో తాగు నీటి సమస్య పరిష్కరించడంతో పాటు మురుగు కాలువల నిర్మాణం చేపడతాను. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యుల సంఖ్యను పెంచి మెరుగైన వైద్యం అందించి ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు కృషి చేస్తా. మేనిఫెస్టో మేరకు విద్యాభివృద్ధికి కృషి చేస్తాను. పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తా. కాళేశ్వరం ప్రాజెక్టు, ట్రిపుల్ ఆర్ రోడ్డు బాధితులకు అండగా ఉండి వారిని ఆదుకుంటాను.

క్లుప్తంగా

తూప్రాన్‌లో ఫ్లాగ్‌మార్చ్



తూప్రాన్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

తూప్రాన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో మంగళవారం ప్రత్యేక బలగాలతో కలిసి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ యాదగిరిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం ముగియడంతో జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ప్రజలు, రాజకీయ నాయకులు ఎన్నికల నియామావళిని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్ఐ శివానందం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి

హత్నూర(సంగారెడ్డి): పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు సెక్టోరియల్ అధికారి భూపుత్ర అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రమైన హత్నూర, కాసాల, బ్రాహ్మణగూడ, గోవిందరాజు పల్లి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాలలో నీరు, విద్యుత్, మరుగుదొడ్లు, సౌకర్యంతో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను మంగళవారం ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. మొత్తం 69 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. విద్యుత్, తాగు నీరు, ర్యాంప్‌ల సౌకర్యాలను పరిశీలించారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న సంగారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి సూచించారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీఎల్‌ఓలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీధర్‌తో పాటు బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ లింక్ చేసుకోండి

నారాయణఖేడ్: భారత్‌గ్యాస్ వినియోగదారులు డిసెంబర్ 31వ తేదీలోపు గ్యాస్ కనెక్షన్‌ను ఆధార్, బయోమెట్రిక్‌తో లింక్ చేసుకోవాలని ఖేడ్ డిస్ట్రిబ్యూటర్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. లింక్ చేసుకోకపోతే గ్యాస్ సరఫరా నిలిచిపోతుందని అన్నారు.

ఓటింగ్‌పై అవగాహన చిత్రం



ఈనెల 30న ప్రతిఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని అవగాహన కల్పిస్తూ పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ రాగి ఆకుపై చిత్రాన్ని గీశారు. దీనిని చూసిన పలువురు ఆయనను ప్రశంసించారు. – నారాయణఖేడ్

గులాబీమయమైన గజ్వేల్



సభలో మహిళా కార్యకర్తల సందడి



సీఎంకు స్వాగతం పలుకుతున్న నాయకులు



కేసీఆర్ మాస్క్‌తో..



గులాబీ శ్రేణుల జోష్.



సభలో ముఖ్యమంత్రికి తిలకం దిద్దుతున్న మహిళ

గజ్వేల్/గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణం గులాబీమయమైంది. సీఎం కేసీఆర్ తన చిట్టచివరి ఎన్నికల ప్రచార సభను సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో నిర్వహించడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. పట్టణంలోని ఐఓసీ వెనుకభాగంలోని మైదానంలో సభా వేదిక ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.53 గంటలకు కేసీఆర్ వేదికపైకి చేరుకున్నారు. ఆ సమయంలో జనం ఒక్కసారిగా కేరింతలు కొడుతూ... నినాదాలతో హోరెత్తించారు. మహిళా ప్రజాప్రతినిధులు సీఎంకు తిలకం దిద్ది స్వాగతం పలకగా... మైనార్టీ నేతలు దట్టీ కట్టారు. సభకు అధ్యక్షత వహించిన అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముందుగా ప్రసంగించారు. ఈ సందర్భంలో నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యల చిట్టాను సీఎం ముందు ఉంచారు. ఆ తర్వాత మాజీ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ భూంరెడ్డి, మాజీ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ తన ప్రసంగాన్ని 3:09గంటలకు ప్రారంభించి అరగంటకుపైగా కొనసాగించారు.

ఆకట్టుకున్న ఏపూరి, మధుప్రియల ఆటాపాట

కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద' బహిరంగ సభలో ప్రముఖ గాయకులు ఏపూరి సోమన్న, మధుప్రియ తమ ఆటపాటలతో సభికులను ఆకట్టుకున్నారు. అప్పుడెట్లుండె తెలంగాణ... ఇప్పుడెట్లుందంటూ కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు

ఆరు గ్యారంటీలపై బాండ్ పేపర్

• నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

హత్నూర (సంగారెడ్డి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు గ్యారంటీలపై నర్సాపూర్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి బాండ్ పేపర్‌ను హత్నూర మండలం దౌల్తాబాద్ ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం సాయంత్రం రిలీజ్ చేశారు. ఆవుల రాజిరెడ్డి అనే నేను... హామీ ఇస్తున్న... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని మాట ఇస్తున్నట్లు బాండ్ పేపర్ పై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట ఇస్తే తప్పని పార్టీ కాంగ్రెస్ అని, ఆరు గ్యారంటీలు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని మండలానికో స్టడీ సెంటర్ ఏర్పాటు చేస్తామని, కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి మండలంలో అంతర్జాతీయ స్థాయి పాఠశాలల నిర్మాణం చేపడుతామని తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీలు రెండూ ఒకటేనని, వాటిని ప్రజలు నమ్మరని చెప్పారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి హకీమ్, నాయకులు రవీందర్ రెడ్డి, సర్పంచ్ కొన్నాల వెంకటేశం, ఉప సర్పంచ్ రియాజ్ అలీ ఉన్నారు.



దౌల్తాబాద్ లో మాట్లాడుతున్న ఆవుల రాజిరెడ్డి

హత్నూర(సంగారెడ్డి): కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలన అవినీతిమయంగా సాగిందని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ లో రాజిరెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క గ్రామం అభివృద్ధి చెందలేదన్నారు. బడుగు బలహీన వర్గాలను పట్టించుకోలేదని విమర్శించారు. కమీషన్ల పేరుతో కేసీఆర్ కుటుంబం దోచుకుందన్నారు. కేసీఆర్ మాటలకు ప్రజలు రెండుసార్లు మోసపోయారని, మూడోసారి అందుకు సిద్ధంగా లేరన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి, హకీం, సుజాత, కృష్ణ, వెంకటేశం, కృష్ణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

ఖేడ్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకే ఓటేయాలని ఖేడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి కోరారు. పంచగామ, మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్, మంగల్‌పేట్ కుమ్మరివాడలో ప్రచారం నిర్వహించారు. అనంతరం శివాజీచౌక్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారంటీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, మున్సిపల్



కుండను తయారు చేస్తున్న భూపాల్‌రెడ్డి

చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, కౌన్సిలర్లు స్వప్న అభిషేక్ షెట్కార్ పాల్గొన్నారు.



ఇస్త్రీ కొడతా.. గెలిపిస్తే సేవ చేస్తా..

దుబ్బాకరూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఓ లాండ్రీ షాపులో బట్టలను ఇస్త్రీ చేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. చెయ్యి గుర్తుకే ఓటేయాలని కోరారు.



కారుకే ఓటేయమని మమ్మీకి చెప్పవా..!

నర్సాపూర్: నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి విజయం కోసం ఆమె కోడలు రుత్వికారెడ్డి కౌన్సిలర్ సునీతతో కలిసి ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా ఓ ఇంట్లో చిన్నారిని ఎత్తుకుని లాలించారు. కారు గుర్తుకే ఓటు వేయాలని పిల్లాడి తల్లిని అభ్యర్థించారు.



చికెన్ కొడుతా... ఓట్లు రాబడుతా...

రామాయంపేట(మెదక్): దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్తా ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఓ దుకాణంలో చికెన్ కొట్టారు. అదేవిధంగా హోటల్‌లో మిర్చీలు వేసి ఓటర్లను ఆకట్టుకున్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే నార్సింగి చెరువులో వేసినట్లే

దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ సుతిలేని సంసారం లాంటిదని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. నార్సింగి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే నార్సింగి చెరువులో వేసినట్లు అవుతుందని ఆరోపించారు. దళితున్ని సీఎం చేస్తామని చెప్పి కేసీఆర్‌లాగా తాము మోసం చేయలేమని, బీజేపీ అధికారంలోకి రాగానే బీసీ అభ్యర్థే ముఖ్యమంత్రి అవుతాడని ఆయన పేర్కొన్నారు. గిరిజన బిడ్డను రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రామలింగారెడ్డి సేవలను బీఆర్‌ఎస్ వారు మరిచిపోయారని ఆరోపించారు. అనంతరం బీజేపీ కార్యకర్తలు పట్టణంలో నిర్వహించిన బైక్‌ర్యాలీలో రఘునందన్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంది హరీశే..

చేగుంట(తూప్రాన్): దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి జరగకుండా మంత్రి హరీశ్‌రావు అడ్డుకున్నాడని ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. మంగళవారం చేగుంటలో నిర్వహించిన బైక్‌ర్యాలీలో రఘునందన్‌రావు పాల్గొని మాట్లాడారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో బీజేపీ గెలిచిన నాటినుంచి తాను చేగుంట డిగ్రీ కళాశాలను తీసుకురావడానికి



చేగుంటలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

ప్రయత్నిస్తే అడ్డుకున్నారని విమర్శించారు. తాను గెలిచినప్పటి నుంచి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి కోసం రూ.100కోట్ల కేంద్రం నిధులు మంజూరి చేయించానన్నారు. ఎంపీగా గెలిచి తొమ్మిదేళ్లయినా చేగుంట–మెదక్ రోడ్డులో రైల్వే బ్రిడ్జి గురించి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఉద్యమకారుడు దివంగత నేత రామలింగారెడ్డి కుటుంబాన్ని మంత్రి హరీష్‌రావు నామరూపాలు లేకుండా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తనను ఓడించడానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామచంద్రం, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, మాజీ సర్పంచులు బాలచంద్రం, రఘువీర్‌రావు, ప్రతాప్‌రెడ్డి, జగన్‌గౌడ్, వెంగళరావు, కర్ణపాండు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: ఓటుహక్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. మంగళవారం ఎస్పీ రూపేష్ తో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో శాసనసభ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో మొత్తం 1609 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామని, మొత్తం 13, 93,711 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ప్రచారం నిషేధించామని, ఎన్నికలు ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. 28 సాయంత్రం 5 గంటల నుంచి ఇతర జిల్లాల వ్యక్తులు జిల్లాలో ఉండకూడదన్నారు. అలాగే ఒపీనియన్, ఎగ్జిట్ పోల్స్ నిషేధించినట్లు తెలిపారు. జిల్లాలో మద్యం షాపులు మూసియాలని, డ్రైడేగా ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్ర శాసన సభకు ఈనెల 30వ తేదీన పోలింగ్ జరగనున్నందున ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించిందన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 29వ తేదీ కూడా సెలవు దినంగా ప్రకటిస్తూ స్థానికంగా ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ 4800 సిబ్బంది, కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేష్

సిబ్బంది కేటాయింపు పూర్తి

ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని ఎన్నికల పరిశీలకుల సమక్షంలో ఆయా కేంద్రాలకు కేటాయించినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. ఐదు నియోజక వర్గాల్లో ప్రత్యేక మహిళా పోలింగ్ కేంద్రాలు, పీడబ్ల్యూడీ, యూత్ మేనేజ్‌మెంట్, మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అబ్జర్వర్లకు వివరించారు. సమావేశంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు దీపక్ సింగ్లా, పవన్ కుమార్, నాజీమ్ జై ఖాన్, అదనపు కలెక్టర్ మాధురి, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి విజయ్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలిస్తాం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మళ్లీ అధికారంలోకి రాగానే పేదల అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చేందుకు కేసీఆర్ కార్యాచరణ రూపొందించారని నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం హత్నూర మండలం బోరుపట్ల, రెడ్డిఖానాపూర్, కాసాల, చందాపూర్, హత్నూర, నస్తీపూర్, మల్కాపూర్ తదితర గ్రామాలలో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు విమర్శలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీటీసీ ఆంజనేయులు, దుర్గారెడ్డి, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన స్వగ్రామమైన కౌడిపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చడంతోపాటు సీసీ, బీటీ రోడ్లు వేసిందన్నారు. ఆసరా పింఛన్ల పెంపుతోపాటు రైతుబంధు, రైతుబీమా కల్పించినట్లు చెప్పారు. మళ్లీ అధికారంలోకి వస్తే రూ.400కు గ్యాస్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సారరామాగౌడ్, సర్పంచ్ వెంటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శివాంజనేయులు, చిన్నంరెడ్డి, దుర్గారెడ్డి, నర్సింహారెడ్డి, శెట్టయ్య, దుర్గాగౌడ్, మల్లేశం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

మండలంలోని సలాబత్‌పూర్ గ్రామ బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌గౌడ్ మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సునీతారెడ్డి గెలుపుకోసం కృషి చేస్తామమని తెలిపారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, సర్దార్, పెంటయ్య పాల్గొన్నారు.



బోరబట్లలో మాట్లాడుతున్న సునీతా లక్ష్మారెడ్డి



కౌడిపల్లిలో ప్రచారం చేస్తున్న మదన్‌రెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

అత్త కోసం కోడలు..

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోసునీతారెడ్డికి మద్దతుగా ఆమె కుటుంబ సభ్యులు ప్రచారం నిర్వహించారు. కుమారుడు ఓ వైపు, కోడళ్లు మరోవైపు కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, నాగరాజు, నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశం, మల్లేశం, పాల్గొన్నారు.

నర్సాపూర్ రూరల్: ఎన్నికల ప్రచారం చివరి సమయంలో సునీతారెడ్డి పట్టణంలోని 15, 14, 8వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నయీమ్, అశోక్‌గౌడ్, పంబల్ల లలితా బిక్షపతి, సరిత, రామచందర్ పాల్గొన్నారు.

నర్సాపూర్: నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు.సునీతారెడ్డి కోడలు రుత్వికారెడ్డి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆమె వెంట కౌన్సిలర్లు, నాయకులు అశోక్‌గౌడ్, సునీత, లలిత, సరిత, బాల్‌రెడ్డి, రవూఫ్, బిక్షపతి, మాణయ్య, రాకేష్‌గౌడ్ పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతా రెడ్డి గెలుపు కోసం ఆమె కోడలు రుత్వికారెడ్డి ప్రచారం నిర్వహించారు. చెన్నాపూర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. రాంచందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నా కట్టె కాలే వరకు మీతోనే..

గంజ్ మైదానంలో భావోద్వేగానికి గురైన చింతా ప్రభాకర్



ప్రజలకు అభివాదం చేస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి: 'నా తుది శ్వాస వరకు మీ తోనేనని .. నేను బతుకుతానో.... చనిపోతానోననే పరిస్థితిలో ఉన్న నా కోసం మీరందరూ ఆలయాలు, చర్చి, మసీదులో ప్రార్థనలు చేశారు.. మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేనిది' సంగారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నాడు. ఎన్నికల ప్రచారం ముగింపులో భాగంగా పట్టణంలోని ఐబీవీ నుంచి గంజ్ మైదానం వరకు గులాబీ శ్రేణులు బైక్ ర్యాలీ, పాదయాత్ర నిర్వహించారు. ఇందులో చింతా ప్రభాకర్, ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రచార రథం పైనుంచి చింత ప్రభాకర్ ప్రజలకు అభివాదం చేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం చింతా మాట్లాడుతూ.. మీరు చూపిస్తున్న ప్రేమాభిమానానికి ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చుకోలేనిదన్నారు. తనకు ఇది చివరి అవకాశమని, చివరి కట్టె కాలేంత వరకు ప్రజల మధ్యలోనే ఉంటానని కంటతడి పెట్టుకున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో శాయశక్తులా కృషి చేస్తానని, జనమే తన బలం.. బలగమని తెలిపారు.